క్లుప్తంగా

మార్కాపురంను పార్లమెంట్ స్థానంగా మార్చాలి

మార్కాపురం: డీలిమిటేషన్‌లో మార్కాపురం పార్లమెంట్, కంభం అసెంబ్లీ స్థానాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు పలు పార్టీల నాయకులకు లేఖలు పంపినట్లు రైతు సంఘం నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశమైన మార్కాపురం 1952, 1955 కాలంలో పార్లమెంట్ స్థానంగా 50 ఏళ్ల క్రితం ఉందని, కంభం అసెంబ్లీ స్థానంగా 40 ఏళ్లు ఉందన్నారు. కాలక్రమంలో ప్రాతినిధ్యం కోల్పోవడంతో డివిజన్ పరిధిలోని 25 మండలాల ప్రజలు ఎంతో నష్టపోయాయన్నారు. వెలుగొండ ప్రాజెక్టుతో పది వేల మంది నిర్వాసితులుగా మారితే వారికి న్యాయం చేయలేదన్నారు. మార్కాపురం–శ్రీశైలం రైలు మార్గం కోసం సర్వే చేసి రూ.150 కోట్లతో అంచనాలు రూపొందించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ డబ్బు రాబట్టలేకపోయారన్నారు. డీలిమిటేషన్‌లో పశ్చిమ ప్రాంతానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు


జేబీకే పురంలో రైతు సేవా కేంద్రం వద్ద జాబితా ప్రదర్శన

బేస్తవారిపేట: కందులు, పప్పుశనగ పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ తెలిపారు. గురువారం మండలంలోని జేబీకే పురం, బేస్తవారిపేట రైతు సేవా కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించారు. కందులకు క్వింటా రూ.7,550, శనగలకు రూ.5,650 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించినట్లు చెప్పారు. 2024 రబీ సీజన్‌లో పంట నమోదు చేయించుకున్న రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు తెలిపారు. మార్పులు–చేర్పులు ఉంటే వీఏఏలకు అర్జీలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ జక్కం మెర్సీ, వీఏఏలు సుజాత, జుబేర్ పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల విగ్రహం ఆవిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న వైస్ చైర్మన్, సంఘు నాయకులు

మార్కాపురం: తెలుగు కవయిత్రి, మొల్ల రామాయణం గ్రంథకర్త మొల్లమాంబ(మొల్ల) విగ్రహాన్ని గురువారం మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ 2 చాతరాజుపల్లి అంజమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగులో కవయిత్రి మొల్ల రచించిన మొల్ల రామాయణం ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథంగా ప్రసిద్ధికెక్కిందన్నారు. 16 శతాబ్దపు తెలుగు కవయిత్రి అయిన ఆమె అనేక గ్రంథాలు రాసి కవులకు మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సీహెచ్ మోహనరావు, నాగ త్రిరుపతయ్య, దగ్గుపాటి శ్రీనివాసరావు, హనుమంతరావు, రంగయ్య, పిచ్చయ్య, బాపనపల్లి చెన్నయ్య, మల్లికార్జున్, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశభక్తి, సేవాగుణం అవసరం


స్కౌట్ విద్యార్థులతో హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి

మార్కాపురం టౌన్: విద్యార్థులకు దేశభక్తి, సేవాగుణం అవసరమని జెడ్పీ హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో భారత్ స్కౌట్స్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో దీక్షా ప్రమాణం చేయించారు. ఆయన మాట్లాడుతూ.. స్కౌట్ నియామాలను పాటించాలని, సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. విద్య, ఉద్యోగ పరంగా స్కౌట్ సర్టిఫికెట్ ప్రయోజనాల గురించి వివరించారు. స్కౌట్ మాస్టర్ సయ్యద్ సమిఉల్లా భాషా, ఉపాధ్యాయులు జీఎల్ రమేష్‌బాబు, ప్రభాకరరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోలీ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం టౌన్: హోలీ పండగ సందర్భంగా రంగులు చల్లుకునే విషయంలో ఎవరి మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రవర్తించవద్దని సీఐ సుబ్బారావు సూచించారు. గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మత సామరస్యాన్ని పాటిస్తూ, మహిళలతో మర్యాదగా వ్యవహరిస్తూ, సంప్రదాయ రంగులు ఉపయోగిస్తూ పండగ నిర్వహించుకోవాలని చెప్పారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నామని, రెచ్చగొట్టే వాఖ్యలు చేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూలీలకు యమా డిమాండ్!

- పొగాకు రెలిస్తే రూ.700.. మిర్చి కోస్తే రూ.550
- గ్రామాల్లో షిఫ్టుల వారీగా సాగుతున్న కోతలు
- ఉష్ణోగ్రతలు పెరగడంతో పనిచేసేందుకు కొందరు విముఖత
- గ్రామాల్లో వేధిస్తున్న కూలీల కొరత
- పట్టణాల నుంచి పొలాల వద్దకు కూలీల తరలింపు


కోతలకు వెళ్తున్న కూలీలు


మేడంవారిపల్లెలో కూలీలు దొరక్క మొక్కలకే పరితమైన పత్తి

మార్కాపురం/రాచర్ల:

రైతులు సాగు చేసిన పంటలు కోత దశకు వచ్చాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను సకాలంలో అమ్ముకుంటేనే రైతులు గట్టెక్కుతారు. లేదంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో కూలీలు దొరక్క రైతులు హైరానా పడుతున్నారు. సమయానికి కూలీలు దొరకకపోవడంతో చేతికి వచ్చిన పంట ఇంటి దాకా వస్తుందా అని సతమతమవుతున్నారు. ఈ ఏడాది మార్కాపురం మండలంలో 2500 ఎకరాల్లో, తర్లుపాడు మండలంలో 60 ఎకరాల్లో, పెద్దారవీడు మండలంలో 1079 ఎకరాల్లో మిర్చిని రైతులు సాగుచేశారు. కొంత మంది రైతులు ఎకరా మిర్చి కోస్తే కాంట్రాక్టు కింద కూలీలకు నగదు చెల్లిస్తున్నారు. రోజు వారీ అయితే ఎక్కువ సంఖ్యలో కూలి ఖర్చులు వస్తున్నాయని మేస్త్రీకి ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేలకు కాంట్రాక్టు ఇస్తున్నారు. మార్కాపురం ప్రాంతంలో మార్చి నెలాఖరు వరకు మిర్చి కోతలు సాగనున్నాయి. మార్కాపురం, తర్లుపాడు మండలాల్లోని కొండేపల్లి, శివరాంపురం, మిట్టమీదిపల్లి, తిప్పాయపాలెం, సీతానాగులవరం, సూరేపల్లి తదితర గ్రామాల్లో పొగాకు సాగు చేపట్టారు. ప్రస్తుతం ఈ రెండు పంటలు పొలాల్లో కోత దశలో ఉన్నాయి. రాచర్ల మండలంలో ఆకవీడు, చోళ్లవీడు, చినగానిపల్లె, అనుములవీడు, సోమిదేవిపల్లె, గుడిమెట్ట, జేపీ చెరువు, రాచర్ల, అనుములపల్లె, రామాపురం, అక్కపల్లె, జి.కొత్తపల్లి తదితర గ్రామాల్లో పొగాకు, పత్తి, మిరప, మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలను అత్యధికంగా సాగు చేశారు. రబీ సీజనల్‌లో మిరప 350 ఎకరాలు, పత్తి 30, పొగాకు 1200, మొక్కజొన్న 1190, కంది 816 ఎకరాల్లో సాగు చేశారు.


పొలంలో మిరప పంటను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

అదనపు కూలి ఇచ్చేందుకూ సై!

ఒక వైపు పొగాకు, మరో వైపు మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. షిఫ్టుల వారీగా కూలీలను పొలాలకు తరలిస్తున్నారు. పొగాకు రెలిస్తే ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ 700 రూపాయలు, మధ్యాహ్నం వరకైతే రూ.500 ఇస్తున్నారు. మిర్చి కోత కూలీలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనిచేసినందుకుగాను 550 రూపాయలు ఇస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా మిర్చి, పొగాకు కోతలు పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కూలీలు దొరక్క సమీప గ్రామాల నుంచి అదనంగా మరో 100 రూపాయలు ఇచ్చి పిలిపించుకుంటున్నారు. మరికొంత మంది రైతులు కూలీల కోసం వేచి ఉండక తప్పడం లేదు. సొంత గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడటంతో మార్కాపురం పట్టణం నుంచి సమీపంలో ఉండే గ్రామాలకు రోజూ వాహనాలు ఏర్పాటు చేసి ఉదయం 6 గంటలకే పొలాలకు తీసుకెళ్లి మధ్యాహ్న సమయంలో వారి వారి ఇళ్ల వద్ద వదిలి పెడుతున్నారు. కూలితోపాటు కొంత మిర్చి కూడా అందిస్తున్నారు. మిర్చి కోసేందుకు ఎకరాకు సుమారు 10 నుంచి 12 మంది వరకూ కూలీలు అవసరం. మార్కాపురం మండలంలోని రైతులు పెద్దారవీడు, తర్లుపాడు మండలాల్లోని గ్రామాల నుంచి కూలీలను పిలిపించుకుంటున్నారు.

పొలాల్లోనే పత్తి.. మార్కెట్‌కు చేరని కాయగూరలు

రాచర్ల మండలంలో మిరప, మొక్కజొన్న, పొగాకు కోత, పత్తి తీతకుగాను మహిళలకు రూ.500 నుంచి రూ.600 వరకు ఇస్తున్నారు. పొగాకు, మిరప, మొక్కజొన్న కోస్తే పురుషులకు రూ.600 నుంచి రూ.700 వరకు కూలి చెల్లిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పత్తి తీసేందుకు కూలీలు దొరకకపోవడంతో తెల్లబంగారం మొక్కలకలే పరితమైంది. జి.కొత్తపల్లి గ్రామంలో 50 ఎకరాల్లో టమోటా, మిరప, క్యాబేజీ, చిక్కుడు, కొత్తిమీర, వంకాయలు, మునగ పంటలు సాగు చేశారు. కూరగాయలను కోసేందుకు కూలీలు దొరక్కపోవడంతో సకాలంలో మార్కెట్‌కు చేర్చలేక నష్టపోవాల్సి వస్తోంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చివరి దశలో కోతలు

మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి, కోలభీమునిపాడు, నికరంపల్లి, చింతగుంట్ల, వేములకోట, తిప్పాయిపాలెం, బిరుదులనరవ, కొత్తపల్లి, మిట్టమీదిపల్లి, రాయవరం, దరిమడుగు, గజ్జలకొండ, తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, తర్లుపాడు, మీర్జపేట, తాడివారిపల్లి, లక్ష్మక్కపల్లి, పోతలపాడు, గానుగపెంట, కలుజువ్వలపాడు, తుమ్మలచెరువు, జగన్నాథపురం, మంగళకుంట, ఓబాయపల్లి, పెద్దారవీడు మండలంలోని కలనూతల, గుండంచర్ల, కె కొత్తపల్లి, దేవరాజుగట్టు, చెర్లోపల్లి, పెద్దారవీడు తదితర గ్రామాల్లో మిర్చి సాగు ఎక్కువగా ఉంది. పండుమిర్చి కోతలు ఇప్పటికే రెండు కోతలు పూర్తయ్యాయి. చివరి కోత పొలంలో ఉంది.

తెల్లబంగారం మొక్కలకే పరిమితమైంది



నేను నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ప్రస్తుతం మొక్కజొన్న, పొగాకు, మిరప కోతలు ఒకేసారి రావడంతో కూలీల కొరత తీవ్రంగా మారింది. విపరీతంగా పెరిగిన ఎండలకు భయపడి కొంతమంది కూలీలు పనులకు రావడం లేదు. వేసవి కాలంలో క్వింటా పత్తి తీసేందుకు రూ.4 వేలు కూలీలకు ఇవ్వాల్సి వస్తోంది. క్వింటా పత్తి ధర కూడా రూ.5,800 నుంచి రూ.6 వేలు మాత్రమే ఉందని వ్యాపారులు అంటున్నారు. పత్తి అమ్మినా కూలీలకు సరిపోవు. అందుకే పత్తి మొత్తం మొక్కలకే పరితమైంది.

గుడిమెట్ల నాగేశ్వరరావు, మేడంవారిపల్లె, రైతు


కోతకు సిద్ధంగా ఉన్న మిర్చి


జి.కొత్తపల్లిలో సాగు చేసిన క్యాబేజీ

బాల రచయితలూ.. భళా..



విద్యార్థులను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, పాఠశాల యాజమాన్యం

- విద్యార్థులకు సబ్ కలెక్టర్ త్రివినాగ్ ప్రశంస

మార్కాపురం టౌన్: విద్యార్థులు యువ రచయితలుగా మారి పుస్తకాలు రచించడం అభినందనీయమని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కమలా హైస్కూల్లో పుస్తక ఆవిష్కరరణ కార్యక్రమం కరస్పాండెంట్ పి.పవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. 8వ తరగతి విద్యార్థులు వివిధ అంశాలపై 35 పుస్తకాలు రచించడం ప్రశంసనీయమన్నారు. పుస్తకాలు రచించడం అంత సులువైన పని కాదన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రసంశిస్తూ, పుస్తకాల రచనలో సహకరించిన ఉపాధ్యాయులు, యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు రచించిన పుస్తకాలు అమెజాన్ ఆన్‌లైన్ స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ రంజన్ తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ పి.సింధుజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు కొమరోలులో 3 కేంద్రాలు


పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈఓ

కొమరోలు: ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు కొమరోలులో 3 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ బొర్రా వెంకటరత్నం తెలిపారు. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 175 మంది, సర్వైట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 175 మంది, నరేష్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి

10వ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ ఆకాంక్షించారు. కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం నిర్వహించిన చివరి గ్రాండ్ టెస్టును పర్యవేక్షించారు. ఆయన వెంట ఇన్‌చార్జి హెచ్‌ఎం అశ్వనీకుమార్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని తూర్పువీధిలో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. నవరత్నాలు పథకాలు అమలు చేసి వైఎస్సార్ సంక్షేమ పాలనను కొనసాగించిన ఘనత వైఎస్ జగన్‌దేనని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పాపిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: కంటి దృష్టిని ఆకస్మికంగా హరించే గ్లకోమా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నేత్ర వైద్యుడు జి.కె.మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం గ్లకోమా వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్లకోమా వ్యాధి వారోత్సవాలను మార్చి 9 నుంచి 15వ తేది వరకు నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 80 మిలియన్ల మంది గ్లకోమా వ్యాధి బారిన పడ్డారన్నారు. సర్వేంద్రియాల్లో నయనాలు ప్రధానం అని అటువంటి నేత్రాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఆదిలక్ష్మీ, కరుణాకర్, శ్రీనివాసులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి ఫ్యాన్ అందజేత


ఫ్యాన్ అందజేస్తున్న జగన్‌బాబు

కొనకనమిట్ల: వెలుగొండస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం రూ.12 వేలు విలువ చేసే పెడస్టల్ ఫ్యాన్‌ను ఆర్యవైశ్య అన్నదాన సత్రం అధ్యక్షుడు కశ్శెట్టి జగన్‌బాబు గురువారం వేదపండితుడు ప్రసాదాచార్యులుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. ఈ నెల 21, 22, 23వ తేదీల్లో వెలుగొండస్వామి తిరునాళ్ల సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ చేయనున్నట్లు తెలిపారు. దాతను ఈఓ చెన్నకేశవరెడ్డి, ఆలయ అర్చకులు అభినందించారు.

వేడుకగా చౌడమ్మ తల్లి తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొనకనమిట్ల: ప్రఖ్యాతిగాంచిన చౌడమ్మ తల్లి తిరునాళ్లను తొలిరోజు గురువారం భక్తుల జయజయ ధ్వానాల నడుమ వేడుకగా నిర్వహించారు. కొనకనమిట్ల మండలంలోని మునగపాడులో అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు. పరిసర గ్రామాల ప్రజలతోపాటు విజయవాడ, గుంటూరు, వినుకొండ, మార్కాపురం ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. నాగేటి సాళ్లల్లో ఉద్భవించిన చౌడేశ్వరి అమ్మవారిని భక్తితో కొలిస్తే సుభిక్షంగా ఉండవచ్చని భక్తుల నమ్మకం. గ్రామంలోని తొగటవీర క్షత్రియులు అమ్మవారిని కులదేవతగా ఆరాధిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. తిరునాళ్ల సందర్భంగా గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో 7 విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వీధి సర్వే చేయకుండా కక్ష సాధింపు


అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్న వీధివాసులు

బేస్తవారిపేట: వీధి రోడ్డు ఆక్రమించకపోయినా కొందరు అసత్య ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని బేస్తవారిపేట చావిటి వీధి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 35 నుంచి 40 ఏళ్ల క్రితం తాము గృహాలు నిర్మించుకున్నట్లు స్పష్టం చేశారు. స్ట్రీట్ మ్యాప్‌లో వీధి ప్రారంభంలో తొమ్మిదిన్నర అడుగులు ఉందని, కొందరు 15 అడుగులు ఉందని విషప్రచారం చేస్తున్నారని తెలిపారు. వీధిలోని గృహాలన్నింటినీ సర్వే చేసి ఆక్రమణలు తేల్చాల్సిన అధికారులు కేవలం నాలుగు గృహాలనే సర్వే చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఫిర్యాదు చేసిన వారే ముందు వైపున 10 అడుగులు ఆక్రమించినట్లు సర్వేలో తేలిందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా వీధి చివర ఎటువంటి అండా లేని ఓ మహిళను బెదిరించి 6 అడుగులు ఆక్రమించి దారి ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. తమ గృహాలకు పంచాయతీ అప్రూవల్ ఉందని, 40 ఏళ్ల క్రితం గృహాలు కట్టుకుని జీవిస్తున్నామని, తమపై ఆరోపణలు చేయడం తగదన్నారు.

అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు..

వీధి మొత్తం సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని, ఇప్పటికే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీపీఓ, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శికి అర్జీలు ఇచ్చామని స్పష్టం చేశారు. తాము ఆక్రమణకు పాల్పడకపోయినా కొలతలు వేశారని, ఆక్రమణలు జరిగిన చోట కొలతలు ఎందుకు తీయడం లేదని వీధి వాసులు ప్రశ్నిస్తున్నారు. వీధి ప్రారంభంలో తొమ్మిది అడుగుల రోడ్డు ఉంటే మోటార్‌సైకిల్ వెళ్లేందుకు రోడ్డు లేదని ఓ పత్రిక(సాక్షి కాదు)లో అసత్య కథనాలు రాయిస్తూ రాజకీయ రంగు పులుముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్లోబల్ మహోత్సవ్-2025 పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల చైర్మన్ షంషీర్ అలీబేగ్, అధ్యాపకులు

మార్కాపురం: ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్లోబల్ మహోత్సవ్–2025 వాల్ పోస్టర్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జాతీయ స్థాయిలో గ్లోబల్ మహోత్సవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ కళాశాలల విద్యార్థులు హాజరై సృజనాత్మకతను, ప్రతిభా పాటవాలను ప్రదర్శించి బహుమతులను పొందాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, కళాశాల డైరెక్టర్ మసూద్ అలీబేగ్ కోరారు. విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, మోడల్ మేకింగ్‌తో పాటు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా షార్ట్ ఫిలిమ్స్, స్కిట్లు, విద్యార్థినీ విద్యార్థులకు విడివిడిగా పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామని వివరించారు. విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, క్యారంబోర్డు, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఎస్ఈ హెచ్ఓడీ షేక్ మహమ్మద్ రఫీ, కో కన్వీనర్ శివకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.